## విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా చర్యలు

**- విద్యుత్ శాఖ మంచిర్యాల ఎస్ఈ శ్రావణ్‌కుమార్**

శ్రావణ్‌కుమార్

మంచిర్యాలటౌన్, జూన్ 15 : మంచిర్యాల సర్కిల్ పరిధిలో విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటు న్నా మని విద్యుత్ శాఖ మంచిర్యాల సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రధానంగా విద్యుత్ ప్రమాదాల భద్రతపై నిర్లక్ష్యం, అవగాహనలో పం, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడటం, మోటార్ స్టార్టర్‌ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించకపోవడం వలన విద్యుత్ ప్రమాదాలు తరచుగా జరుగు తున్నాయని అన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉద్యోగులందరూ తగిన నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. సెక్షన్ ఇన్‌చార్జి ప్రతిరోజూ 15 నిమిషాలు పనికి ముందు భద్రతా చర్యల గురించి సిబ్బందితో చర్చించాలని అన్నారు. అనుమతి కలిగిన అధికారి తగిన జాగ్రత్తతో మాత్రమే లైన్ క్లియర్ ఇవ్వాలని, ఫోన్‌ద్వారా లైన్ క్లియర్లను ఇవ్వ డాన్ని నివారించాలని, విధుల్లో ఉన్న ఎస్ఎల్‌ఎ, ఎల్‌ఎ బ్రేక్ డౌన్ వర్క్ లొకేషన్ వద్ద ఉండాలని అన్నారు. ఫీల్డ్ సిబ్బందికి అన్ని భద్రతా పరికరాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 33కేవి, 11కేవి లైన్ యొక్క సింగిల్ లైన్ నమూనా రేఖ చిత్రాన్ని ప్రతి సెక్షన్ ఆఫీసు వద్ద ఏబీ స్విచ్, డబుల్ పాయింట్ ఆఫ్ సప్లై హెచ్‌టి లైన్ క్రాసింగ్ లొకేషన్‌ను సూచిస్తూ ప్రదర్శించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి ఫీల్డ్ సిబ్బంది నుంచి సీనియర్ అధికారుల వరకు ఉద్యోగులందరి నుంచి సమిష్టి కృషి అవస రమని , భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం చాలా ముఖ్యమని , నిరంతర శిక్షణ మరియు భద్రతా పద్ధతులను బలోపేతం చేయడం వలన ప్రమాదాలు జరుగవని స్పష్టం చేశారు.

## విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలి

శ్రీరాంపూర్, జూన్ 15 : సింగరేణి విశ్రాంత ఉద్యోగులను ఆదుకొని వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతు శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో కోల్‌మైన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం బాబూరావ్, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిప్యూటీ ప్రధానకార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ సీఆండ్ఎండీ ఎన్ బలరామ్‌కు వినతిపత్రం అందిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ పెన్షన్‌తో బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి విశ్రాంత ఉద్యో గుల పెన్షన్ విధానం కేంద్రప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్)లో ఉందన్నారు. ఓఎన్‌జీసీ రిటైర్డ్ కార్మికుల ఆర్థిక ప్యాకేజీని సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ కార్మికుల త్యాగాలను గుర్తించి, సర్వీస్‌లో ఉన్న కార్మికులకు లాభాల వాటా చెల్లించినట్లుగా విశ్రాంత ఉద్యోగులకు కూడా కొద్దో గొప్పో లాభాల వాటా చెల్లించాలన్నారు. దాంతో వారికి ఎంతో ఊరట కలుగుతుందన్నారు. రిటైర్డ్ కార్మికులకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీరయ్య, ఎస్ వెంకటరమణ, సాయిరాంగౌడ్ పాల్గొన్నారు.

## ఘాట్‌లో ఆర్టీసీ బస్సు కారు ఢీ

కెరమెరి, జూన్ 15 : కెరమెరిఘాట్ ప్రాంతంలోని మూలమలుపు వద్ద ఆర్టీసీ బస్సు కారు ఢీ కొని కారులో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. ఎస్ఐ గుంపుల విజయ్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉట్నూర్ నుంచి ఆసిఫాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న కారు అదుపు తప్పి ఢీ కొన్నాయి. దీంతో కారులో ఉన్న వారికి గాయలయ్యాయని తెలిపారు. బస్సు డ్రైవర్ కేంద్రే రాహుల్‌పై చర్యలు తీసుకోవాలని కారు డ్రైవర్ షేక్ సమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# క్రీడా పాఠశాల పిలుస్తోంది..

- **ఆదిలాబాద్, కరీంనగర్, హకీంపేట్‌లలో ప్రవేశాలకు ఆహ్వానం**
- **ఇతర వివరాల కోసం 99666 84201, 81065 56176 నంబర్లను సంప్రదించాలి**

జిల్లా క్రీడా పాఠశాల భవనం

ఎదులాపురం, జూన్ 15 : తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదిలాబాద్, కరీంనగర్, హకీంపేట్ క్రీడా పాఠశా లలో 4వతరగతిలో ప్రవేశాలకు జిల్లాకు చెందిన విద్యార్థులు మండ లస్థాయి పోటీల్లో పాల్గొనాలని కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. మండల విద్యాధికారి ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు.

### అర్హతలు..

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బాలబాలికలు 4వ తరగతి ప్రవేశా నికి వయసు 8 నుంచి 9 ఏండ్లు అనగా సెప్టెంబర్ 1, 2015 నుంచి ఆగస్టు 31, 2019 మధ్య కాలంలో జన్మించి ఉండాలన్నారు. భౌతిక, ఆరోగ్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

### ధ్రువీకరణ పత్రాలు

వయసు, విద్యార్హత, ప్రొగ్రెస్ రిపోర్టు(4వ తరగతి కొరకు 3వ తరగతి ప్రొగ్రెస్ రిపోర్టులు), జనన ధ్రువీకరణ పత్రం, పది పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం సమ ర్పించాలి.

### జిల్లా, రాష్ట్ర స్థాయి ఎంపిక

మండల స్థాయిలో ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం మండల విద్యాధికారి ఎంపిక చేసిన అభ్యర్థులను జిల్లాస్థాయిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ నెల 26,27 తేదీల్లో ఉదయం 6 గంటలకు పోటీ పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన అభ్యర్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఇక్కడ ఎంపి కైన వారు ఆదిలాబాద్, కరీంనగర్, హకీంపేట్ క్రీడా పాఠశాలకు కేటాయిస్తారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలి. ఇతర వివరాల కోసం సెల్ నంబర్లు 99666 84201,81065 56176కు సంప్రదించాలన్నారు.

## పకడ్బందీగా మెడికల్ బోర్డును నిర్వహిస్తున్నాం

**సీఎండీ ఎన్ బలరామ్**

సీఎండీ ఎన్ బలరామ్

శ్రీరాంపూర్, జూన్ 15 : అనారోగ్య కారణాలవల్ల ఉద్యోగం చేయలేక పోతున్న కార్మికుల కోసం ప్రతినెల నిర్వహిం చే మెడికల్ బోర్డును అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నామని సింగరేణి సంస్థ చైర్మన్ ఆండ్ ఎండీ ఎన్ బలరా మ్ స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సీఎండీ ప్రకటనలో పేర్కొన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న ప్రతీ కార్మికుడిని తప్పనిసరిగా అన్‌ఫిట్ చేయడం జరుగుతుందన్నారు. ఎవరి ప్రమేయం ఉండదని కొందరు కార్మికుల వద్దకు వెళ్లి మెడికల్ బోర్డులో ఎలాగైనా అన్‌ఫిట్ చేయిస్తామని, వారసులకు ఉద్యోగాలు పెట్టిస్తామని ప్రలోభ పడుతున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి దళారులను ఎవరూ నమ్మద్దని హెచ్చరించారు. సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి మేరకు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) నేర దర్యాప్తు సంస్థ (సీఐడీ) కూడా సింగరేణి మెడికల్ బోర్డుపై ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. మెడికల్ బోర్డు ప్రక్రియలో అవినీతికి ఎక్కడా ఆస్కారమే ఉండదన్నారు. మాయ మాటలతో మోసగిస్తున్న వారు ఎదురైతే వారి వివరాలను సింగరేణి విజిలెన్స్ అధికారుల సెల్: 9491144104 ద్వారా ఫిర్యాదు చేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగతుందన్నారు.

## బ్యాంకు లింకేజీలో జిల్లాకు రెండో స్థానం

మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జిల్లా అధికారులు

మంచిర్యాలటౌన్/నస్పూర్, జూన్ 15 : బ్యాంకు లింకేజీలో గత మూడు సంవత్సరాలుగా మంచిర్యాల జిల్లా రాష్ట్ర స్థాయిలో అవార్డు తీసుకోవడం జరుగుతుం దని, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచిందని డీఆర్‌డీవో కిషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి గాను 5,977 సంఘాలకు రూ.358.58 కోట్లను బ్యాంకు లింకేజీ లక్ష్యంగా నిర్ధేశించగా 6606 సంఘాలకు రూ. 420.18 కోట్లను 59,454 మంది సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించామని తెలిపారు. శనివారం హైద్రాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన బ్యాంకు లింకేజీ వార్షిక ప్రణాళిక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, డీపీఎం స్వర్ణలత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి, కార్యదర్శి అనిత పాల్గొన్నారని తెలిపారు.

## జిల్లా అభివృద్ధి దిశగా కృషి చేయాలి

**జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి**

మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

హాజీపూర్, జూన్ 15 : జిల్లా అభివృద్ధి దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ (స్థానిక సంస్థలు), జిల్లా అటవీశాఖ అధికారి శివ్ అశీష్ సింగ్, జడ్పీ సీఈవో గణపతితో కలిసి హాజరైయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతు రైతు సంక్షేమంలో భాగంగా రైతులకు విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ రాయితీతో పాటు ఎంఆర్పీ ధరలకు విక్రయించడం జరుగుతుందని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో రహదారులు, వంతెనల నిర్మాణంలో అటవీశాఖ సంబంధిత అనుమతులు త్వరగా పొందడంతో పాటు వన్యప్రాణుల వలన గాయపడిన క్షతగాత్రులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారి తెలిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించడంతో పాటు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పాడి రైతులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గొర్రెల పంపణీ పథకంలో డిడిలు కట్టిన వారికి ప్రభుత్వ పాలసీల ప్రకారం యూనిట్స్ కానీ, నగదు కాని ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ సత్యనారాయణ, జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు ఉన్నారు.

## రాజ్‌కుమార్‌ను అభినందించిన జీఎం

రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న జీఎం

శ్రీరాంపూర్, జూన్ 15 : అత్యధిక సార్లు రక్తదానం చేసి రాష్ట్ర గవర్నర్‌చే అవార్డు అందుకున్న శ్రీరాంపూర్ ఎంవీటీసీ హెడ్ ఓవర్‌మెన్ రాజ్‌కుమార్‌ను శనివారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ 53సార్లు రాజ్‌కుమార్ రక్తదానం చేయడం అభినందనీయమాన్నారు. రాజ్‌కుమార్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవో ఎం శ్రీనివాస్, డీవైజీఎం రాజేశ్వర్, డీవైసీఎంవో డాక్టార్ రమేశ్‌బాబు, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

## రాజంపేట కాలనీ వాసుల వినతి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 15 : ఆసిఫాబాద్ పట్టణంలోని న్యూ రాజంపేట కాలనీకి రోడ్డు స్థలం వదలకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీ వాసులు శనివారం ఎమ్మెల్యే కోవలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ నిరుపేదల కోసం ప్రభుత్వం గతంలో ప్లాట్లు కేటాయించగా కాలనీలో నివాసాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. కాలనీకి వెనుక భాగంలో రోడ్డుకు స్థలం కేటాయించినప్పటికి రోడ్డుకు స్థలం వదలకుండా పక్క భూమి వారు నిర్మాణాలు చేపడుతున్నారని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిర్మాణాలను నిలిపివేసి కాలనీకి రోడ్డు కోసం స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బుర్సా పోచయ్య, గోపి, మల్లయ్య, అరుణ్, మంగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినతి

రెబ్బెన, జూన్ 15 : మండలంలోని తుంగెడ గ్రామంలోని ఎంపీపీఎస్, జడ్పీ ఉన్నత పాఠశాలలో బోర్‌వెల్స్ మంజూరు చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి శనివారం వినతి పత్రం అందించినట్లు ఎంపీపీ జుమ్మిడి సౌందర్య పేర్కొన్నారు.

## నేడు సమావేశం

రెబ్బెన, జూన్ 15 : సీసీసీలోని నర్సయ్యభవన్(ఏఐటీయూసీ కార్యాలయం)లో ఆదివారం పదవి విరమణ పొందిన కార్మికుల గ్రాట్యూటీ కోసం సమావేశం నిర్వహిస్తున్నా మని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యద ర్శి ఎస్ తిరుపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథి గా ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పాల్గొం టారన్నారు. పదవీ విరమణ పొందిన కార్మికులు హాజరు కావాలన్నారు.

## అధికారులు సమన్వయంతో పని చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 15 : వివిధ కేసులకు సంబంధించి బాధితులకు అందజేసే పరిహారంపై పోలీస్ అధికారులతో పాటు జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. బాధితులకు వివిధ కేసులకు సంబంధించి అందజేసే నష్టపరిహారంపై పోలీస్ అధికారులు జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాధికారి అశోక్, ఎస్ఐ రాజేశ్వర్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.